
# అంతరంగం




ఎన్.ఎస్.ఎన్. మూర్తి

*(గత సంచిక తరువాయి)*

"అందుకని ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉండిపోతావా?"

"అవును. అదే నా నిర్ణయం".

"గోపాలం! నువ్వు నన్ను నిజంగా ప్రేమించావా?"

"ఏం? ఎందుకొచ్చిందా సందేహం నీకు?"

"నువ్వు నన్ను నిజంగా ప్రేమించినట్లయితే నేను ఒక్క కోరికను కోరతాను. తీరుస్తావా?"

"నా ప్రేమను శంకిస్తున్నావా?"

"అయితే నా కోరికను తప్పక తీరుస్తావు కదూ!"

"నిరభ్యంతరంగా!"

"అయితే నా చేతిలో ఒట్టు వేయి" అంటూ చెయ్యి చాపింది హేమ.

"ఇదిగో నీ మీద ఒట్టు వేసి చెప్తున్నాను. నువ్వు ఏమి అడిగినా కాదనను".

"కాదనవు కదా!"

"హేమా! సస్పెన్సుతో నన్ను చంపక నీకేమి కావాలో అడుగు!"

"అయితే నువ్వు పెళ్ళి చేసుకో. అది నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. మీ అమ్మగారు కూడా సంతోషిస్తారు!"

తన ఒట్టుతో హేమ నన్ను ఇలా కట్టిపడేస్తుందని నేనెన్నడూ ఊహించలేదు. ఇప్పుడు కాదంటే తనపై నా ప్రేమ వట్టిదే అంటుంది.

ఇంక మార్గాంతరం లేక సరే అని అనవలసి వచ్చింది. తరువాత చూసుకుందాంలే అని లోలోపల అనుకున్నాను.

అంతటితో హేమ ఊరుకోలేదు.

"చూడు గోపాలం! నీ పెళ్ళి వచ్చే నెలలోనే!"

"అదేమిటి? పెళ్ళికూతురును వెతుక్కోవాలిగా. దానికి టైమ్ పడుతుందిగా!"

"నేను నీకు పెళ్ళికూతురిని సెలెక్టు చేసి ఉంచాను. నాలుగు నెలల క్రితం మా నాన్నగారు పనిచేసే కాలేజీకి మాలకొండయ్యగారనే లెక్చరర్ ట్రాన్స్‌ఫర్‌మీద వచ్చారు. వారి ఏకైక పుత్రిక రమ నీకు సరిగ్గా జోడు కుదురుతుంది. బాగా చదువుకుంది. అందంగా ఉంటుంది. గుణవంతురాలు. పాటలు బాగా పాడుతుంది. ఇంతకన్నా మంచి పిల్ల నువ్వు ఎంత ప్రయత్నించినా దొరకదు. వాళ్ళు మీవాళ్ళే కాబట్టి మీ అమ్మగారికి ఏ

"అభ్యంతరమూ ఉండదు." గుక్క తిప్పుకోకుండా పెళ్ళికూతురు గుణగణాల గురించి ఏకరువు పెట్టింది హేమ.

హేమ కోరిక మీద అమ్మ, నేను అనంతపూర్ వెళ్ళి రమను చూడ్డం, మా గురించి ముందుగానే అన్ని విషయాలు శంకరంగారు, హేమ ఆడపెళ్ళివారికి పూస గుచ్చినట్లు చెప్పి ఉంచడంతో మాలకొండయ్యగారికి, వారి సతీమణికి, పెళ్ళికూతురు రమకు మా సంబంధం నచ్చడంతో హేమ అన్నట్లుగానే నెల తిరక్కుండానే నాకు రమకు పెళ్ళి అయిపోయింది. కాని రమతో నా కాపురం మూడు నాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయింది. రమ కాపురానికి వచ్చిన పది రోజులకు ఆమె బామ్మగారు కాలం చేశారని కబురు అందడంతో రమను అనంతపూర్ పంపాను. ఆఫీసులో అర్జెంటు పని ఉండడంవల్ల రమతో వాళ్ళ ఊరు వెళ్ళలేకపోయాను.

మరో ఇరవై రోజులు ఒంటరి జీవితం గడిపాను.

రమ ఊరి నుంచి వచ్చిన దగ్గరి నుంచి ఆమెలో విపరీతమైన మార్పు వచ్చింది. పెళ్ళయిన పది రోజుల కాపురంలో నా సౌఖ్యమే తన శ్వాసగా భావించింది. నన్ను ఒక అపురూపమైన వ్యక్తిగా భావించి నన్ను పూజించింది. నాకు చిన్న తలనొప్పి వచ్చినా గిలగిలా కొట్టుకునిపోతూ సకల సపర్యలు చేసేది. ఆలుమగలు ఒకరికోసం మరొకరు బతకాలని నాకు నీతులు బోధించేది. జీవనకావ్యం దాంపత్యమని దానిని రసరమ్యంగా చేసేది ఆలుమొగల అన్యోన్యతే అని, అందుచేత ఆ అన్యోన్యతను మేమిద్దరం కాపాడుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో దానికి లోటు రాకూడదని నాకు పదే పదే చెప్పేది. అంత సుగుణాల గని అయిన రమ నాకు భార్యగా దొరికినందుకు నేను మనసులో భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పుకున్నాను. రమ లాంటి మణిపూసను నాకు ఏరికోరి భార్యగా సమకూర్చిన హేమకు నేనెంతో ఋణపడి ఉన్నానని అనుకునే వాడిని.

కొత్త కోడలి ప్రవర్తన అమ్మను కూడా ముగ్ధురాలిని చేసింది. ఆమె ఆనందానికి అంతం లేదు. తన గారాల కొడుకు ఇంత కాలానికి పెళ్ళి చేసుకుని భార్యతో సజావుగా కాపురం చేసుకుంటున్నందుకు అమ్మ ఆనందాబ్ధిలో ఓలలాడింది.

రమ అనంతపురంలో ఉన్న ఇరవై రోజుల్లో నేను ఇదివరలో హేమను గాఢంగా ప్రేమించిన సంగతి ఆమెకు ఎలాగో తెలిసింది. అందుకే పుట్టింటి నుంచి రావడమే అనుమానమనే పెనుభూతాన్ని మెడకు చుట్టుకుని వచ్చింది. తిరిగి వచ్చిన రోజు నుండి శూలాల్లాంటి సూటిపోటి మాటలతో నా హృదయాన్ని తుత్తునియలు చేసింది. నాకు ప్రత్యక్ష నరకాన్ని చూపింది. మనసు చంచల స్వభావం కలది. అది శంకాగ్రస్తం కాకూడదు. ఒకవేళ అనుమానపు మచ్చ తగిలిందా దానిని తుడిచివేయడం అంత తేలిక కాదు.

రమ బాధపడడం, నన్ను బాధపెట్టడంలో కూడా కొంత సబబు ఉన్నదని నా అంతరాత్మ ఘోష పెడుతూనే ఉంది. స్త్రీకి అసూయ సహజం. దేనినైనా పంచుకోడానికి స్త్రీ ఇష్టపడుతుంది గానీ భర్త ప్రేమను మరో స్త్రీతో పంచుకోవడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదు.


నేను హేమను ప్రేమించిన మాట నిజమని, కాని మా ఇద్దరి మధ్యా ఎటువంటి శారీరక సంబంధం లేదని ఎన్నిసార్లు చెప్పినా రమ వినిపించుకోలేదు. శారీరక సంబంధం లేకపోయినా నేను మానసిక వ్యభిచారానికి ఒడిగట్టానని నా మీద నింద వేసింది.

ఆ పరిస్థితుల్లో మా ఇద్దరి మనసులు వేరయ్యాయి. శరీరాల కలయికకు తావే లేకపోయింది. నేను మళ్ళీ పెళ్ళయిన బ్రహ్మచారిగా మిగిలిపోయాను. ఆమె హృదయంలో చెలరేగే దావాగ్ని జ్వాలలను ఆర్పివేసి మా జీవితాలను నందనోద్యానంగా మార్చటానికి ప్రయత్నించి, విఫలుడనయ్యాను.

మా ఇద్దరి ప్రవర్తనను గమనిస్తున్న అమ్మకు మేము భార్యా భర్తలుగా కాపురం చేయడంలేదన్న యదార్థం అర్థమైపోయింది. బెంగతో అమ్మ మంచమెక్కింది. మరో రెండు వారాలకు ఆ బెంగతో మమ్ములను శాశ్వతంగా విడిచి తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయింది.

ఎవరి కష్టాలు ఎలా ఉన్నా కాలం నిర్విరామంగా సాగిపోతూనే ఉంటుంది. అప్పుడే అమ్మ పోయి ఆరు నెలలయింది. కాని, రమ ప్రవర్తనలో ఏ విధమైన మార్పు లేదు. మేమిద్దరం ఏ విధమైన ఆనందం లేకుండా ఇంట్లో నడుస్తున్న శవాలలాగ కాలం గడుపుతున్నాము.

ఆ వేళ రాఖీ పండుగ. ఆఫీసుకు సెలవు. ఇంటిముందు ఆటో ఆగిన శబ్దం వినబడితే బయటకు వచ్చి చూశాను. నా కళ్ళను నేను నమ్మలేకపోయాను.





## ఎందుకో మరి!

తెలుగువాడినంటావు
తెలుగు నీ నాడి
అంటావు
దేశభాషలందు తెలుగు లెస్సని పొంగిపోతావు
తెలుగువాడు మరో భాష మాట్లాడితే
నొచ్చుకుంటావు
నీ పిల్లలు కాన్వెంటు చదువులతో 'డాడీ'
అంటే మురిసిపోతావెందుకో మరి
వర్ణవైషమ్యాల కోసమే గదా దేవుళ్ళంత
మంది
సాంఘిక అసమానతల కోసమే గదా
డబ్బున్నది మరి
ఆశ్రిత పక్షపాతమే అన్నింటా అగ్రగామి
సమానత్వం మీద ఊకదంపుడు
ఉపన్యాసాలెందుకో మరి
ఉగ్గుపాలతో నీతికథలు
గోరుముద్దలతో సత్య ప్రవచనాలు
అడుగడుగునా మానవతా విలువలు
ఇన్ని మంచి విత్తనాలు నాటినా చివరికి
చెడే మహావృక్షమయింది ఎందుకో మరి!
పుస్తకాలు మస్తకాలకి పదునని తెలుసు
విజ్ఞాన కాంతులు వెదజల్లే జ్యోతులని తెలుసు
ప్రతిభకి కొలమానాలు విద్వత్తుకి
ఉపమానాలు అయిన
వాటిని కొనుక్కోకుండా అడుక్కుని
చదవడంలోనే ఆనందాన్ని
అనుభవిస్తామెందుకో మరి!
- ప్రతాప వెంకటసుబ్బారాయుడు

## వి'చిత్ర' వ్యాఖ్య పోటీ ఫలితం -2

మేము ప్రారంభించిన వి'చిత్ర' వ్యాఖ్య పోటీలో మా ఊహకు మించి పాఠకులు పాల్గొని వ్యాఖ్యలు పంపారు. అందరికీ మా అభినందనలు. మాకు వచ్చిన (28-01-2004 సంచిక) వ్యాఖ్యలలో ఈ క్రింది వ్యాఖ్యను ఉత్తమంగా ఎన్నిక చేయడమైనది.



*"నయనాలకే ఒక అందాల హరివిల్లుగా*
*నవతరం మోటార్‌బైక్‌పై నీ పయనం"!*

**పంపినవారు**

**కె. శ్యామలరావు, తిరుపతి**

*వీరికి ప్రియదత్త వారపత్రిక మూడు మాసాల పాటు అందజేస్తాము.*


- ఎడిటర్

చేత్తో ఒక హ్యాండ్ బ్యాగ్ పట్టుకుని, మొహం మీద చెరగని చిరునవ్వుతో గబగబా నడుస్తూ వస్తున్నది హేమ.

గుమ్మంలో అడుగుపెడుతున్న హేమను చూడగానే రమ మొహం నల్లబడిపోయింది. మొహం చిట్లించుకుంది. వీరిద్దరి మధ్య ఏ కురుక్షేత్ర సంగ్రామం జరుగుతుందో అన్న భయం పట్టుకుంది నాకు. ఆ పరిస్థితుల్లో నేను హేమను పలకరించకపోవడమే ఉత్తమమనిపించింది. అందుకే కిటికీలోంచి బయటకు చూస్తూ నిలబడిపోయాను. సోఫాలో కూర్చున్న హేమ "అన్నయ్యా! ఎలా ఉన్నావు?" అని పలకరించడంతో ఆశ్చర్య సముద్రంలో మునగడం నా పనయింది. ఏమిటి ఈ కొత్త పిలుపు అని నేను ఆలోచిస్తున్నాను. వంటింట్లోకి వెళ్తున్న రమ కూడా వెనక్కు తిరిగి చూసింది. హేమ సోఫాలోంచి లేచి రమ దగ్గరకు వెళ్ళి "వదినా! ఎలా ఉంది బెంగుళూరు?" అని అడిగింది.

రమ సమాధానం ఇచ్చే లోపలే హేమే అంది

"అన్నయ్యా! ఈ వేళ రాఖీ పండుగ కదా! నీ చేతికి రాఖీ కట్టాలి" అని అంటూ బ్యాగ్ లోంచి రాఖీని తీసి నా కుడిచేతికి కట్టింది. ఈ సీన్ చూశాక రమ మొహం విడింది. ఏమనుకుందో ఏమో "రా హేమా!" అని అంటూ హేమను వంటింట్లోకి సాదరంగా తీసుకునిపోయింది.



రమ ప్రవర్తన చూసి నా గుండెలోని బరువు పూర్తిగా తగ్గిపోయింది. ఇంక నా కష్టాలు గట్టెక్కుతాయని లోలోపల సంబరపడిపోయాను. నా ప్రవర్తన మీద రమకు పూర్తి నమ్మకం కలగాలన్న ఉద్దేశంతో, ముగ్గురం సావిట్లో కూర్చుని కాఫీ తాగుతున్నప్పుడు, నేను హేమను "చెల్లాయి" అని సంబోధించడం మొదలుపెట్టాను. నా మనస్సులో ఎట్టి కల్మషం ఎలాగూ లేదు. హేమ తను నన్ను ప్రేమించడం లేదని, ఒక స్నేహితుడిగానే భావిస్తున్నానని చెప్పిన తర్వాత ఆమెను ప్రియురాలిగా మనసులో తలవడం మానివేశాను.

ఆ రోజంతా రమ ఎంతో ఆనందంగా ఉంది. మేము ముగ్గురం సరదాగా కబుర్లు చెప్పుకుంటూ గంటలు నిమిషాలుగా గడిపాము. దగ్గర దగ్గర ఏడాది తర్వాత మా ఇంట్లో సుఖసంతోషాలు వెల్లివిరిశాయి.

సాయంత్రం ఐదు గంటలకు హేమ "అన్నయ్యా! ప్రక్కవీధిలో నా స్నేహితురాలు కాంచన ఉంది. దాన్ని చూసి వస్తాను" అంది.

"అలాగే చెల్లాయ్, 8 గంటల లోపు వచ్చేయి. ముగ్గురం కలిసి భోంచేద్దాం" అన్నాను.

రమ, హేమ వంటింట్లో వంట పనిలో నిమగ్నమయి ఉన్నారు. హేమ వచ్చింది కదా అని రెండు మూడు పిండివంటలు చెయ్యడానికి రమ నిశ్చయించుకుంది.

హేమ నన్ను అన్నయ్యా అని పిలిచి చేతికి రాఖీ కట్టింది. మన సంప్రదాయం ప్రకారం చెల్లెలు చేతికి రాఖీ కట్టినప్పుడు ఆ చెల్లెలికి అన్నయ్య ఏదో ఒక బహుమతి ఇవ్వాలి. కాని హేమ రాఖీ కట్టడం హఠాత్తుగా జరిగింది కాబట్టి అప్పుడు హేమకు ఏమీ ఇవ్వలేకపోయాను. అదే కాకుండా రాకరాక హేమ చాలా కాలానికి మా ఇంటికి వచ్చింది. ఆమెను సత్కరించి పంపడం మా విధి. అందుకే కాస్త పని చూసుకుని వస్తానని రమకు, హేమకు చెప్పి ఇల్లు వదలి తిన్నగా చిక్‌పేటకు వెళ్ళాను. అక్కడ సీతామహాలక్ష్మి సిల్క్ ప్యాలెస్‌లో మూడు వేల రూపాయల ఖరీదైన కంచి చీర కొన్నాను. దానికి మ్యాచింగ్ అయ్యే జాకెట్టు గుడ్డ కొని, మెజిస్టిక్ సర్కిల్ దగ్గర పువ్వులు, పళ్ళు కొనుక్కుని ఇంటికి చేరుకునేటప్పటికి ఎనిమిదన్నర అయ్యింది. ఇంటికి రాగానే హేమ కనబడలేదు. తన

### మళ్ళీ ఏక్- దో- తీన్!

'ఏక్ దో తీన్...' అంటూ అలనాడు దుమ్మురేపిన మాధురీదీక్షిత్ పాటను మరిపించేలా ఇప్పుడు ప్రియాంకచోప్రా పాట తెరపైకి రానుందట! బాబీడియోల్ హీరోగా 'కిస్మత్' సినిమా త్వరలోనే రానుంది. అందులో ప్రియాంకాచోప్రాని చూసినవాళ్ళు మళ్ళీ మళ్ళీ చూసేలా కనిపించ నుందని చెబుతున్నారు ఆ చిత్ర యూనిట్. అందుకోసమే ఆ పాటకు సంబంధించిన స్టిల్స్ కూడా బయటకు పొక్కనీయడం లేదట! ఇంతకీ ప్రియాంక ఎలా కనిపించనుందో!

స్నేహితురాలు కాంచనను కలుసుకోవాలని వెళ్తానంది. ఎనిమిది గంటలకల్లా వచ్చేయమన్నాను. ఇంకా రాలేదేమిటా అని అనుకుంటున్నవేళ రమే అంది. "పది నిమిషాల క్రితం హేమ ఫోన్ చేసిందండీ. ఆమె స్నేహితురాలు కాంచన బలవంతం మీద కాంచనతో భోజనం చేసి, అక్కడే పడుకుని రేపు ఉదయం వస్తానంది. తన కోసం నేను స్పెషల్‌గా పిండివంటలు చేశానంటే రేపు వచ్చి తింటానంది. ఏమీ అనుకోవద్దని మరీ మరీ చెప్పింది".

హేమ కాంచన ఇంట్లో రాత్రి ఉండిపోవడానికి అసలు కారణం నాకు అర్థమయింది. చాలా కాలం తర్వాత సంతోషంగా ఉన్న మా ఇద్దరి ఏకాంతానికి భంగం కలగకూడదని. పెళ్ళయి దాదాపు ఏడాది నుండి కాపురం చేస్తున్న హేమ ఇలా ఆలోచించడంలో ఆశ్చర్యమేమీ లేదు.

రమ నేను భోజనాలు ముగించగానే నేను బెడ్ రూమ్‌లోకి జారుకున్నాను. రమని వంటింట్లో పని ముగించుకుని చప్పున రమ్మని చెప్తూ, కొన్ని నెలల నుండి మనసు కల్లోల స్థితిలో ఉండడం వలన నాకు రాత్రిళ్ళు నిద్ర సరిగ్గా పట్టేది కాదు. ఆ వేళ చాలా కాలం తరువాత హేమ ధర్మమా అని నా మనసు ప్రశాంతంగా ఉంది. అందుకే మంచం మీద నడుం వాల్చేటప్పటికి నాకు తెలియకుండానే గాఢ నిద్రలోకి జారుకున్నాను.

ఎంత సేపు నిద్రపోయానో నాకే తెలియదు. నా పాదాలను ఎవరో నొక్కినట్లు అనిపించడంతో గభాలున మెలకువ వచ్చింది. అంతట్లో కన్నీళ్ళు బొటబొటమని నా పాదాలపై జారినట్లు అనిపించింది. పాపం రమ ఇంత కాలానికి నిజం తెలుసుకుని బాధపడుతోంది. పశ్చాత్తాపానికి మించిన మంచి పని మరొకటి ఉండదు. మనిషి తను చేసిన తప్పులు తెలుసుకుని పశ్చాత్తాపపడితే మనసు తేలికవుతుంది. తను చేసిన తప్పుల వల్ల బాధకు గురైన వ్యక్తికి కూడా కొంత ఉపశమనం కలుగుతుంది.

"రమా! ఈ వేళ నీ అనుమానం తీరిపోయింది కదా! నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఇంక నువ్వు బాధపడవలసిన అవసరం లేదు. ఇక్కడ నుంచి మన జీవితం కొత్తమలుపు తిరుగుతుంది. నీకు సకల సౌఖ్యములు కలుగజేస్తాను. ఇదివరలో నువ్వు అన్నట్లు మనం ఆదర్శ దంపతులుగా ఉందాం" అని అంటూ లేచి లైట్ వేశాను. వెంటనే రమ నా పాదాలను పట్టుకుని "నన్ను క్షమించండి. మిమ్ములను అన్యాయంగా ఎంతో బాధ పెట్టాను" అంటూ బిగ్గరగా ఏడ్వడం మొదలు పెట్టింది.

ఆమె కన్నీరు తుడిచి నా బాహుబంధాల్లోకి తీసుకుని ఊరడించాను. "ఇది ఏడ్పులతో గడపవలసిన రాత్రి కాదు. ఎంతోకాలం తర్వాత మళ్ళీ మన మనసులు కలిసిన రాత్రి ఆనందంగా గడపవలసిన రాత్రి" అంటూ రమను మంచం మీద పడుకోబెట్టి లైట్ ఆర్పివేసి ఆమె పక్కన చేరాను.

మరునాడు ఉదయం తుళ్ళుతూ, నవ్వుతూ హేమ వచ్చింది.

రాగానే "అన్నయ్యా! నేను వెంటనే మా ఊరు వెళ్ళిపోవాలి" అంటూ సంభాషణ మొదలుపెట్టింది.

"అదేమిటి వదినా! ఇంక రెండు రోజులు ఉండి వెళ్ళుదువులే" అని రమ అంటే,

"నీకు తెలియదు వదినా! మీ అన్నయ్య నన్ను ఒదిలి ఒక్క రోజు కూడా ఉండలేరు. అప్పుడే నేను ఇల్లు వదిలి రెండు రోజులయింది. నేను వెంటనే వెళ్ళిపోవాలి" అని అంటూ తన సామాను సర్దుకోవడంలో మునిగిపోయింది.

హేమకోసం క్రితం రాత్రి చేసిన పిండి వంటలతో పాటు కాఫీ చేసి ఇచ్చింది రమ.

ముగ్గురం అల్పాహారం పూర్తి చేసిన తర్వాత రమ ఒక పళ్ళెంలో కొత్త చీర, రవికెల గుడ్డ, పళ్ళు, పూలు, పసుపు కుంకుమ పెట్టి హేమకు అందజేసింది.

"ఇవన్నీ ఎందుకు నాకిప్పుడు" అంటూ మొహమాట పడింది హేమ.

"ఇంటి ఆడపడుచుకు ఆ మాత్రం చెయ్యకపోతే ఎలా?" అని రమ అనడంతో వాటిని సంచీలో పెట్టుకుని మా ఇద్దరి పాదాలకు వంగి నమస్కరించింది.



## మల్లికా! మజాకా!

'క్వాయిష్' సినిమాతో శెభాష్(ఎక్స్‌పోజింగ్ చేసినందుకులెండి) అనిపించుకున్న కులుకులాడి మల్లికా శెరావత్ నటించిన సినిమా 'మర్డర్' త్వరలోనే రానుంది! బరితెగించిన మహిళ పాత్రలో తను కనిపించబోతున్నట్లు చెబుతున్న మల్లికని 'మరి ఎక్స్‌పోజింగో?' అనడిగితే "ముందే చెప్పానుగా! దీంట్లో బరితెగించిన మహిళ పాత్రలో కనిపించబోతున్నానని" అంటూ అసలు విషయం చెప్పింది. 'ఖ్వాయిష్' సినిమాలో 17 ముద్దు సీన్లలో నటించి అబ్బా అనిపించిన ఈ గుమ్మడు అంతకు మించిన హాటు హాటువేవో దీనిలో ఉంటాయనీ మరీ చెబుతోంది!

# ఐస్‌క్రీమ్ వేసిన శిక్ష




పూర్ణ ఫుడ్స్ కరెంటు కట్ చేయవద్దని ఉత్తర్వు ఉన్నప్పటికీ జె.ఇ., ఇ.ఇ., కరెంట్ కట్ చేశారుట. ఇది కోర్టు ధిక్కారమని ఒరిస్సా హైకోర్టులో కేసు వేయబడింది. ఈ సంస్థకే కాదు, ఆ ప్రాంతంలో 30 సంస్థలకి రిపేరు మూలంగా కరెంటు కొద్దిసేపు నిలిపివేయబడింది అని వాదించారు ఇంజనీర్లు. మాది ఐస్ క్రీమ్ వ్యాపారం, అది చెడిపోయింది. జె.ఇ.కి లెటర్ రాసి పంపాము. ఆయన అది తీసుకోలేదు. దానిపై ఇ.ఇ.కి రాసినాము అని ఫిర్యాది కంపెనీ వాదన. హైకోర్టు రికార్డు పరిశీలించి ఇంజనీర్లు కోర్టు ధిక్కారం చేశారు అని నిర్ణయించింది. ఇ.ఇ. తన అధికార పర్యవేక్షణ చేయనందువలన అతనికి రూ. 1,000 జరీమానా విధించింది. జె.జి.కి ఏడు రోజుల జైలుశిక్ష విధించబడింది.

కేసు సుప్రీమ్ కోర్టుకు చేరింది. అక్కడ కూడా కోర్టు ధిక్కారం చేశారని నిర్ణయించబడింది. ఇంజనీర్ల న్యాయవాది శిక్ష గురించి ప్రార్థించారు. జె.ఇ. ఆరు నెలల్లో రిటైర్ అవుతాడు అని కోరగా అతనికి జైలుశిక్ష రద్దు చేసి రూ. 2,000 జరీమానా విధించారు. ఇ.ఇ. అప్పటికే రిటైర్ అయినారుట. అతని అప్పీలు తిరస్కరించబడింది.

ఇంతకూ వ్యాపారం ఏమిటంటారా? ఐస్ క్రీమ్ తయారీ.

కోర్టు ఉత్తర్వును ఖాతరు చేయకపోతే శిక్ష తప్పదు అనే నీతి తెల్సుకోవాలి ప్రత్యేకంగా ఉద్యోగస్తులు.




***(ఎ.ఐ.ఆర్. 2003, ఎస్.సి., 557)***

"చెల్లాయి! దేవుడు నీకు మేలు చేయుగాక!" అని దీవించాను.

వెళ్తూ "అన్నయ్యా! వదినను బాగా చూసుకో. మీ ఇద్దరూ ఆనందంగా ఉండాలి. అదే నాకు కావాల్సింది" అని చెప్తూ ఆటో ఎక్కింది.

హేమ వెళ్ళిపోగానే నాలో నేను ఆలోచించుకోవడం మొదలుపెట్టాను. నిజంగానే హేమ విషయంలో నేను చాలా పొరపడ్డానన్న దృఢ నమ్మకానికి వచ్చాను. హేమ ప్రవర్తనను నేనే అర్థం చేసుకోలేకపోయాను. నన్ను ఆమె ఒక ఆత్మీయుడైన స్నేహితుడిగానే భావించింది. కాని తను చెప్పినట్లు నన్ను ఎన్నడూ కాబోయే జీవిత భాగస్వామిగా తలచలేదు. నేనే ఏవేవో ఊహించుకుని కన్నతల్లికి, కట్టుకున్న ఇల్లాలికి కష్టం కలిగించి బాధపెట్టాను. నేను చేసిన పొరపాటుకు, నా బలహీనతకు నన్ను నేనే లోలోపల నిందించుకున్నాను.

హేమ వెళ్ళిన నాలుగైదురోజులకను కుంటాను మైసూరులో ఏదో మీటింగులో పాల్గొని సాయంత్రం ఐదున్నరకు ఆఫీసుకు చేరుకున్నాను. నా టేబుల్ మీద ఉన్న కవర్ మీద నా కన్ను పడింది. దానిమీద ఎడ్రసు రాసిన హ్యాండ్ రైటింగ్ నాకు పరిచయమున్నట్లుంది. కాని ఎవరిదో వెంటనే స్ఫురణకు రాలేదు. తీరా కవర్ చింపి చూస్తే అది హేమ రాసిన ఉత్తరం. "ప్రియాతి ప్రియమైన నా గోపాలం!" అంటూ ఉత్తరం మొదలైంది. నన్ను సంబోధించిన తీరు కొత్తగా ఉండి నాకు ఆశ్చర్యం కలిగించడంతో ఉత్తరాన్ని నెమ్మదిగా చదవడం మొదలుపెట్టాను.

"నీకు నా మనసులోని మాట చెప్పాలని ఎంత కాలం నుంచో అనుకుంటున్నాను. ఈ నాటికి ఆ అవకాశం చిక్కింది. రమలో ఉన్న అనుమానపు భూతాన్ని నేను మీ ఇంటికి వచ్చి నా నటనతో పారదోలగలిగాను. ఇప్పుడు అసలు నిజం నీకు మాత్రం తెలిసినా, మీ ఇద్దరి దాంపత్యానికి ఏమీ పరవాలేదని భావిస్తున్నాను.

గోపాలం! నువ్వు నన్ను ఎంతగా ప్రేమించావో అంతకన్నా ఎక్కువగా నేను నిన్ను ప్రేమించాను. మనకు పరిచయమైన దగ్గర నుంచి నిన్ను నాకు కాబోయే జీవిత భాగస్వామిగానే భావించాను. అందుకే నువ్వు నన్ను ముద్దు పెట్టుకున్నా, కౌగలించుకున్నా నేను ఏమీ అడ్డు చెప్పలేదు. కాని మన ప్రేమ విషయంలో విధి వక్రించింది.

మనిద్దరం పెళ్ళి చేసుకుందామని నువ్వు ప్రపోజ్ చేసినప్పుడు నేను ఎగిరి గంతేశాను. నా మనసులో పేరుకుపోయిన కోరిక తీరుతున్నందుకు చెప్పలేని ఆనందంతో ఇంటికి వెళ్ళి మా నాన్నతో మన ప్రేమ విషయం గురించి చెప్పాను. మన పెళ్ళికి ఆయన ససేమిరా ఒప్పుకోలేదు. తన కూతురును ఒక హరిజనుడికిచ్చి పెళ్ళి చెయ్యడానికి చచ్చినా ఒప్పుకోనన్నాడు.

నీ రక్తం ఎక్కించడం వల్ల మా నాన్న కులం తక్కువ వాడు అయ్యాడన్న ఛాందస భావంతో మా బామ్మ ఆత్మహత్య చేసుకుంది. మనిద్దరి పెళ్ళి అయితే తరతరాలుగా మా వంశం, మా కులం మైల పడిపోతాయని మా నాన్న మనస్ఫూర్తిగా నమ్మాడు.

మా నాన్నగారికి కులమత భేదాలు లేవని, ఆయన ఉదార స్వభావాన్ని నువ్వు ఎన్నోసార్లు

## మారుతున్న తరం

నాటి తరానికి పెద్దలం
నేటి తరానికి ప్రేక్షకులం
ఈ కలగాపులగం యుగంలో
కనిపించేదంతా కలవరం ॥నాటి॥
ఈ గందరగోళాల మధ్య
పెద్దోడికి గృహస్థాశ్రమం
పెద్దోళ్ళకు వృద్ధాశ్రమం
పిల్లలకు కాన్వెంట్
తల్లులకు పనిష్మెంట్ ॥నాటి॥
కంట్రోల్ తప్పిన కామంతో
మెరికల్లాంటి కుర్రకారు
మెరకవీధుల్లో పచార్లు
కొన్నాళ్ళకే ఎయిడ్స్‌తో
ఉజ్వల భవితవ్యమంతా బేజారు ॥నాటి॥
ఇంగిత జ్ఞానమంటేనే ఇంగ్లీషు
సన్నాసులు స్మరించేదే సంస్కృతం
తెల్లారిన తెలివంటేనే తెలుగు
వీటన్నింటితో పని లేకపోయినా
లక్షలుండి ఎలక్షన్‌లో నిలబడి గెలిస్తే
లక్షణంగా మహా జ్ఞాని అయినట్లే ॥నాటి॥
ఓట్లేసే వాళ్ళకు ఎప్పుడూ నోట్లో వేలు
గెలిచినోళ్ళకు ఇంట్లో వేలకు వేలు
కోవిదుల్లా విమర్శిస్తే కోపాలు
భట్రాజకవుల్లా పొగిడితే సంతోషాలు ॥నాటి॥

– షణ్ముఖశ్రీ

మెచ్చుకునేవాడివి. మా నాన్న విషయంలో అవన్నీ వేదికలెక్కి ఉపన్యాసాలు ఇవ్వడానికే పరిమితం. తన కూతురు పెళ్ళి విషయం వచ్చేటప్పటికి ఆ ఉన్నత భావాలకు ఆయన తిలోదకాలు వదిలాడు.

ఒకవేళ తనను ఎదిరించి నిన్ను పెళ్ళి చేసుకుంటే నేను ముందుగా మా ఇంట్లో చూడబోయేది నా తల్లిదండ్రుల శవాలే అని కరాఖండిగా చెప్పేశాడు. మా నాన్నలో నిగూఢంగా దాగివున్న మూర్ఖత్వం, పట్టుదల నాకు తెలుసును. మన పెళ్ళి జరిగితే ఆయన అన్నంత పని చేయడం ఖాయం.

ఇతరులకు బోధించే నీతులు తమ దాకా వచ్చేసరికి మాయమైపోతాయి. ఇటువంటి ఊసరవెల్లులు, మేకవన్నె పులులు మన సంఘంలో ఎంతోమంది ఉన్నారు. వారిలో మా నాన్న ఒకరు. అప్పుడు నా ముందు రెండే రెండు మార్గాలు వున్నాయి. ఒకటి మా నాన్నను కాదని నిన్ను పెళ్ళి చేసుకోవడం, దానివల్ల తల్లిదండ్రుల మరణానికి కారణభూతురాలినవడం. రెండవది, నా ప్రేమను త్యాగం చేయడం, ఆత్మద్రోహమని తెలిసినా నేను రెండవ దాన్నే ఎన్నుకున్నాను. అందుకే నిన్ను ప్రేమించడం లేదని నిర్మొహమాటంగా నీకు చెప్పివేశాను.

మా నాన్న ఇష్టప్రకారం మరొకరిని పెళ్ళి చేసుకున్నాను. ఆయనతో కాపురం చేస్తున్నాను. కాని మన ప్రేమను, నిన్ను మరువలేకపోతున్నాను. స్త్రీ ప్రేమించడం, ప్రేమింపబడడం జీవితంలో ఒక పర్యాయం మాత్రమే. తరువాతవన్నీ కామతృప్తి కొరకు చేసే పనులు, చెప్పుకునే ధర్మపన్నాలు.

ఒకరికి హృదయా న్నిచ్చి, మరొకరికి తనువునర్పించడం భార్య యైనా అది వ్యభిచరించడంతో సమానం. ప్రస్తుతం నా పరిస్థితి ఇది. మనసొక్క చోట, మనువొక చోట. ఆశలనేవి మానవ సహజ మైనవి. ఆశించినది లభ్యం కానప్పుడు మానవ జీవితం బాధాతప్తమవుతుంది. ఇది నా విషయంలో ముమ్మాటికీ నిజం అయ్యింది.

ఏది ఏమైనా మన జీవితాలను తిరిగి రాయలేని పరిస్థితి మనది. ఉన్న బంధాలను తెగతెంపులు చేసుకుని మనకు కావాల్సిన జీవితం ఏర్పాటు చేసుకోవడానికి మనం అమెరికా లాంటి దేశంలో లేము. మనమున్నది పవిత్ర భారత దేశంలో. మనకు నిర్దిష్టమైన కొన్ని సంప్రదాయాలు, ఉత్తమమైన సంస్కారం ఉన్నాయి. అందుచేత మనసులో బాధాగ్ని రేగుతున్నా నా జీవితం ఇలా సాగిపోవాల్సిందే. నేను చేయగలిగినదల్లా మరొక జన్మ అంటూ ఉంటే మనల్నిద్దరినీ మళ్ళా ప్రేమికులుగా పుట్టించమని, ఈసారి భార్యాభర్తలుగా చేయమని భగవంతుడిని ప్రార్థించుకోవడమే.

నా మనసులోని మాట నీకు రాసిన తర్వాత మనసు కాస్త కుదుట పడింది. నా హృదయాంతరాలలో ఒదిగి వున్న భావాలను నాకు ప్రియాతి ప్రియుడైన గోపాలానికి తెలియజేశానన్న తృప్తి నాకు ఉంది.

నేను నిన్ను మనసారా కోరేది నా ఉత్తరం చదివాక జరిగిపోయిన దానికి విచారించకు. జరిగినదానిలో నీ తప్పేమీ లేదు. కాలంలో కలిసిపోయిన సంఘటనలను మననం చేసుకోకు. దానివల్ల నీకు కలిసివచ్చేదేమీ ఉండదు. రమ, నువ్వు ఆనందంగా పదికాలాల పాటు ఉండాలని నా కోరిక.

ఇట్లు,

ఒకనాడు నువ్వే నా ప్రాణనాథుడవుతావని, నమ్ముకుని విధి వక్రించి మరొకరి భార్యనై బాధాతప్త హృదయంతో కాలం వెళ్ళబుచ్చుతున్న అభాగ్యజీవి హేమ".

ఉత్తరం చదవడం పూర్తి చేయగానే గ్లాసుడు మంచినీళ్ళు త్రాగే వరకు షాక్ నుండి నేను తేరుకోలేకపోయాను.

ఎప్పుడూ నవ్వుతూ, తుళ్ళుతూ ఉండే హేమనే నేను ఎరుగుదును. అటువంటి హేమ హృదయంలో ఇంత దావాగ్ని దాగివుందని తెలుసుకుని ఆశ్చర్యపోవడం నా వంతయింది.

మన జీవితాలను ఏదో అదృశ్య శక్తి నడుపుతూ ఉంటుంది. మనుషులంతా విధి ఆడించే జీవిత చదరంగంలోని పావులు. మన చేతిలో ఏమీ లేదు. ప్రతిదీ భగవంతుడు నిర్ణయించినట్లు జరిగిపోవలసిందే.

హేమ ఉత్తరం చదివాక ఒక్క విషయం మాత్రం నాకు పూర్తిగా అర్థమైంది. స్త్రీ హృదయం చదవశక్యంగాని మహా కావ్యం. సామాన్య మానవులకు అర్థం కాని ఉద్గ్రంథం. ఆమె హృదయం అగాధమగు అంబుధి. ఆమె అంతరంగం అనంత విశ్వం. స్త్రీ హృదయపు లోతులను కొలవడం మానవమాత్రులకు తరం కాదు. స్త్రీ కాలకూట విషాన్ని, అమృతాన్ని ఒకే విధంగా ఒకేసారి హృదయంలో పదిలపర్చుకో గలదు. అంతరంగంలో హాలాహలం దాచుకుని ముఖంమీద చిరునవ్వులు సంతరించుకునే మహత్తర శక్తి, చాతుర్యము, స్త్రీకి మాత్రమే పుట్టుకతోనే దేవుడు ప్రసాదించిన వరాలు.

*(అయిపోయింది)*


**100% AYURVEDIC PRODUCT**

**గ్యాస్ట్రబుల్‌తో బాధపడుతున్నారా?**
**మలబద్ధకము తో**
**ఇబ్బంది పడుతున్నారా?**
**కడుపునొప్పి మొదలగు జీర్ణశక్తికి సంబంధించిన వ్యాధులకు అనేక సంవత్సరముల నుండి ప్రయోగములు చేసి చంద్రికా వారిచే తయారుచేయబడినటువంటి అతి ఉత్తమమైన ఆయుర్వేద మందు**

**క్యాప్‌జైమ్**
**చూర్ణము**




**జీర, ఇంగువ, సైంధవలవణం, యవాక్షారము, ఇసఫ్‌గోల్, మారీచము మొదలగు అనేక రకములైనటువంటి అతి ఉత్తమమైన ఆయుర్వేద మూలికలతో తయారుచేయబడినది.**

**ఈ క్యాప్‌జైమ్ చూర్ణమ్ తీసుకొనుట వలన ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్ రావు**

మార్కెట్ చేయువారు
**రామా మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ & కో.**
పార్కురోడ్, విజయవాడ - 1. ఫోన్ : 2424133.